వాస్తవాలు పలుకు DD9 వార్త
తెలుగు దినపత్రిక
సోమవారం 11-05-2026

# రామయ్య చెంతకు అంజన్న మాలధారణ భక్తులు

- రేపు రామాలయంలో మాల విరమణకు దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- కొండగట్టు అంజన్నకు భద్రాద్రి రామయ్య పట్టు వస్త్రాలు అందజేసిన దేవస్థానం ఈవో



6

# నార్సింగిలో జోరుగా అక్రమ నిర్మాణాలు



## 250 నుంచి 300 గజాల్లో 'ఆకాశసౌధాలు

- చుట్టు కొలతల్లేవు - అంతస్తులకు హద్దుల్లేవు
- ప్లాన్లు గోరంత - అక్రమాలు కొండంత
- యంత్రాంగం నిద్రపోతోందా.? లేక మామూళ్ల మత్తులో జోగుతోందా?
- జిలెన్స్ అధికారులు స్పందించెనా?

6

నార్సింగి మున్సిపాల్ సర్కిల్ పరిధిలో చట్టం చచ్చిందా.? నిబంధనలు తుంగలో తొక్కాల్సిందేనా.? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి.గాలిలో మేడల్లా లేస్తున్న అక్రమ కట్టడాలు చూస్తుంటే,ఇక్కడ టౌన్ ప్లానింగ్ నిబంధనలు వర్తించవా అనే అనుమానం కలగక మానదు.అధికారుల అండదండలతో బిల్డర్లు రెచ్చిపోతుంటే,అడిగే నాథుడే కరువయ్యాడని మున్సిపల్ ప్రజలు కోడై కూస్తున్నారు.

రాజేంద్రనగర్,మే 10 డిడి 9 వార్త




## శంషాబాద్‌లో దారి దోపిడీ
# ముఠా అరెస్ట్

నలుగురు నిందితులు అరెస్ట్
సీసీటీవీ ఆధారాలతో కేసు ఛేదించిన శంషాబాద్ పోలీసులు

7

# ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్న పాయం..



- 30 మంది లబ్ధిదారులకు సుమారు 15 లక్షల రూపాయల విలువైన CMRF చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

3

# ప్రజా సమస్యలపై నిరంతర పోరాటమే సిపిఐ లక్ష్యం

- 18 శాఖల సమన్వయంతో ఉద్యమాలను బలోపేతం చేయాలి
- ప్రతి మూడు నెలలకు శాఖ సమావేశాలు నిర్వహించాలి

7







# ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే విజయరమణ రావు

**డిడి9వార్త / పెద్దపల్లి మే 11:**

పెద్దపల్లి పట్టణంలోని అమర్ చంద్ కళ్యాణ మండపంలో పెద్దపల్లి పట్టణ మరియు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసి పదవ తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన 98 మంది విద్యార్థిని విద్యార్థులకు, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినీ విద్యార్థులను శాలువాలతో సన్మానించి, మెమొంటోలు బహూకరించి వారందరినీ అభినందించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొంకూరి అవినాష్, మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు మరియు మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మండల విద్యాధికారి మరియు పలు గ్రామాల సర్పంచ్లు మరియు పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 30 మంది లబ్ధిదారులకు సుమారు 15 లక్షల రూపాయల విలువైన CMRF చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

- **ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్న పాయం..**
- **అవసరమైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా తాను కృషి చేస్తానని హామీ..**



**మణుగూరు.మే 10**
**(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలంలో వివిధ అనారోగ్య సమస్యలు మరియు అత్యవసర వైద్య చికిత్సల కోసం ఆర్థిక సహాయం అవసరమైన 30 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) ద్వారా మంజూరు అయినటువంటి సుమారు రూ.15 లక్షల విలువైన చెక్కులను పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అందజేశారు.బయ్యారం క్రాస్ రోడ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నాడు నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు లబ్ధిదారులతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అవసరమైన ప్రతి ఒక్కరికి సహాయం అందేలా తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మణుగూరు (జగ్గారం) వద్ద ఆర్ టి సి బస్సు ప్రమాదం..

- **కండక్టర్ కు,ప్రయాణికులకు గాయాలు.ఆసుపత్రికి తరలింపు.**



**మణుగూరు.మే 10**
**(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం మండలం జగ్గారం ప్రాంతంలో ఆదివారం ఉదయం మణుగూరు డిపోకు చెందిన ఆర్ టి సి బస్సు ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీ కొన్న ఘటన లో పది మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు కాగా, కండక్టర్ కు తీవ్ర గాయాలు అయ్యాయి.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన వారిని మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రయాణికులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఉదయం మణుగూరు నుంచి బయలుదేరిన బస్సు జగ్గారం ప్రాంతంలోకి రాగానే ముందు భాగంలో వెళుతున్న ట్రావెల్ బస్సు రోడ్డుపై అకస్మాత్తుగా ఆగడంతో వెనుకనే ఉన్న ఆర్ టి సి అద్దె బస్సు వెనుకనుండి ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్షతగాత్రులను పరామర్శించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మణుగూరు లోని వంద పడకల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బస్సు ప్రమాద బాధితులను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను డాక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. వారు త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.







# మోడీ సభకు పస్రా నుంచి భారీగా తరలిన బీజేపీ శ్రేణులు

**గోవిందరావుపేట, మే 10( డి డి 9 వార్త )**

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు గోవిందరావుపేట మండలంలోని పస్రా గ్రామం నుంచి ఆదివారం బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల నేపథ్యంలో తెలంగాణ గడ్డపై మరోసారి మోడీ గర్జన వినిపించింది మండల అధ్యక్షుడు మార్గ సతీష్ ఆధ్వర్యంలో జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి మెరుగు సత్యనారాయణ, సీనియర్ నాయకులు రుద్రారపు సురేష్, మండల ప్రధాన కార్యదర్శి పశువుల బాబురావు, బైరి అశోక్, బూత్ అధ్యక్షులు అజ్మీర జీవిత్, మంత్యనాయక్, నిడివోలు పాండు, శ్రీనివాస్ తదితరులు సభకు హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని, తెలంగాణలో కూడా అభివృద్ధి రాజకీయాలకు ప్రజలు మద్దతు తెలపనున్నారని పేర్కొన్నారు. సభ విజయవంతం కోసం కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



# ఆదివారం పలు శుభ కార్యక్రమాల్లో పాల్గొన్న BRS పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు..

- **నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలను తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే.**

**మణుగూరు. మే 10**
**(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక నియోజకవర్గంలో ఆదివారం నాడు జరిగిన పలు వివాహ వేడుకల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పాల్గొన్నారు. పినపాక మండలం లోని పోతురెడ్డి పల్లి గ్రామంలో దొడ్డ శ్రీనివాసరెడ్డి తిరుపతమ్మ దంపతుల కుమార్తె నాగ ప్రసన్న వివాహం సందర్భంగా హాజరై వధువుకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు.అనంతరం మణుగూరు మండలం లోని పగిడేరు గ్రామపంచాయతీ పరిధిలోని శాంతి నగర్ లో కర్నె పౌలు కుమారుడు వివాహానికి హాజరై అక్షింతలు వేసి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలను తెలియచేశారు. వారి కుటుంబ వైవాహిక జీవితంలో సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తో పాటు మణుగూరు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, టౌన్ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్, ఆవుల నరసింహారావు,TBGKS నాయకులు నాగెల్లి వెంకటేశ్వర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు కర్నె మురళి, వేర్పుల సురేష్,పగిడేరు గ్రామపంచాయతీ సర్పంచ్ కుంజా శ్రావణ్, పప్పుల ప్రసాద్,దామల్ల దయాకర్,పగిడిపల్లి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.





## వేసవి తరగతులకు సేవలందించిన డాక్టర్ ఓలాద్రి ప్రవీణ్ రెడ్డికి ఘన సన్మానం

**గోవిందరావుపేట, మే 10 (డిడి 9 వార్త)**

పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ పసర లో 10వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి ప్రత్యేక తరగతుల్లో భాగంగా మూడు రోజుల పాటు తమ అమూల్యమైన సమయాన్ని కేటాయించి విద్యార్థులకు మార్గదర్శనం చేసిన 200304 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ ఓలాద్రి ప్రవీణ్ రెడ్డిని సంస్థ సభ్యులు చిరు సన్మానంతో ఘనంగా గౌరవించారు.

ఈ సందర్భంగా ఓఎస్ఏ ప్రధాన కార్యదర్శి బొబ్బ క్రాంతికుమార్ విద్యార్థులతో కలిసి డాక్టర్ ప్రవీణ్ రెడ్డి సేవలను అభినందిస్తూ, ఆయన అందించిన ప్రోత్సాహం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమం పూర్వ విద్యార్థుల సేవాభావానికి నిదర్శనంగా నిలిచింది.

# విద్యతోనే విజయ శిఖరాలు....

- **పదిలో ప్రతిభ కనబరిచిన భాను ప్రకాష్ కు అండగా భాగం ఫౌండేషన్**
- **పాల్గొన్న భాగం సేవా ఫౌండేషన్ నిర్వాహకులు భాగం రాధాకృష్ణ**



**బోనకల్,మే10,(డీడీ9 వార్త):**

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించే దిశగా భాగం సేవా ఫౌండేషన్ మరోసారి ముందడుగు వేసింది. ఆర్థిక ఇబ్బందులను లెక్క చేయకుండా ఏకాగ్రతతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అండగా నిలుస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.మండల పరిధిలోని ఆళ్లపాడు గ్రామానికి చెందిన టి.భాను ప్రకాష్ అదే గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 560 మార్కులు సాధించి ప్రతిభ చాటాడు. పేద కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన భాను ప్రకాష్ చదువుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ మట్టిలో మాణిక్యంలా మెరిశాడు.ఇతని ప్రతిభను గుర్తించిన భాగం సేవా ఫౌండేషన్ స్థాపకులు,గోవిందాపురం (ఏ) గ్రామ యువకుడు,ఎన్ఆర్ఐ భాగం రాకేష్ స్వయంగా విద్యార్థికి ఫోన్ చేసి అభినందించారు.భాను ప్రకాష్‌లోని పట్టుదల,క్రమశిక్షణ,చదువు పై ఉన్న నిబద్ధతను కొనియాడారు. ప్రతిభ ఉన్న విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.విద్యార్థిని మరింత ప్రోత్సహించేందుకు ఫౌండేషన్ తరపున తక్షణమే రూ.10 వేల నగదు బహుమతిని ప్రకటించారు. అంతేకాకుండా ఇంటర్మీడియట్‌లో 950కు పైగా మార్కులు సాధిస్తే మరో రూ.20 వేల ప్రోత్సాహకాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.భవిష్యత్తులో చదువుల కోసం ఏ అవసరం వచ్చినా భాగం సేవా ఫౌండేషన్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

ప్రతిభ ఉన్న విద్యార్థులకు పేదరికం అడ్డంకి కాకూడదనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు భాగం రాకేష్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు ఇటువంటి ప్రోత్సాహం ఎంతో అవసరమని,వారి విజయాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.విద్యార్థిని కలిసి అభినందించిన వారిలో భాగం సేవా ఫౌండేషన్ నిర్వాహకులు భాగం రాధాకృష్ణ,రామిశెట్టి రవి, ఆత్మకూరి రవి,కందుల పాపారావు ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.



## భద్రాద్రి రామయ్యకు రూ.3 లక్షల విలువైన బంగారు తులసీదళాలు అందజేత

- **స్వామి వారి మూలవరులకు ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన**

**భద్రాచలం , మే 10, డిడి9 వార్త**

భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి ఆదివారం సందర్భంగా అంతరాలయంలో ఆర్జిత సేవలో భాగంగా ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అదేవిధంగా భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన కుండ్లకుంట శ్రీకాంత్, నీలిమ దంపతులు సుమారు రూ.3 లక్షలు విలువ గల రాగిపై బంగారు పూతతో తయారు చేసిన 108 తులసీ దళాలను విరాళంగా అందజేశారు. వీరు తొలుత లలయంలో స్వామి వారికి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, లింఆల సాయిబాబాలకు అందజేశారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన డాక్టర్ వాసిరెడ్డి రామనాథం

**బోనకల్,మే10,(డీడీ9 వార్త):**

మండలంలోని తూటికుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ మండల రైతు సంఘం మాజీ అధ్యక్షులు పాపినేని వెంకటయ్య కుమారుడు శ్రీనివాసరావు - ఉషారాణి దంపతుల కుమార్తె పూజిత వివాహ వేడుక శనివారం వైరాలోని కమ్మవారి కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది.ఈ వేడుకకు టీడీపీ జిల్లా కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం హాజరై నూతన వధూవరులు పూజిత - వంశీలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ,జిల్లా తెలుగు యువత మాజీ కార్యదర్శి మైనేని రవికుమార్,జిల్లా మాజీ కార్యదర్శి సాధినేని హనుమంతరావు,మాజీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మేడేపల్లి రాణి,మండల నాయకులు తుళ్లూరు కొండల రావు,తూటి కుంట్ల గ్రామ శాఖ అధ్యక్షులు సాధినేని కొండలరావు,తూటి కుంట్ల గ్రామ కార్యదర్శి కంచర్ల చిన్నప్ప,బెజ్జం రాయప్ప తదితరులు పాల్గొన్నారు.





## పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..

- **గురువులు కేవలం పాఠాలు చెప్పేవారు మాత్రమే కాదని,వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే మహానుభావులనీ కొనియాడారు.**

**మణుగూరు.మే10 (డి డి 9వార్త)**

ప్రముఖ సాహితీవేత్త, విశిష్ట ఉపాధ్యాయులు, మరియు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు గారి గురువర్యులు అయిన ఎర్రా ప్రగడ రామమూర్తి మాస్టారి విరచిత "స్వగతాలకు స్వాగతాలు" మరియు "నేనొక నిత్య విద్యార్థిని" పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం పినపాక మండలంలోని జివిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పుస్తకాలను ఆవిష్కరించి రచయిత గారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. "గురువులు అనేవారు కేవలం పాఠాలు చెప్పేవారు మాత్రమే కాదు, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే మహానుభావులు". నా గురువర్యులు రామమూర్తి మాస్టారు అందించిన మార్గదర్శకత్వం, విలువలు, క్రమశిక్షణ నా ప్రజా జీవితానికి పునాది" అని అన్నారు.ఈ పుస్తకాలు సమాజానికి మార్గనిర్దేశం చేసే ఆలోచనలను అందిస్తాయని, యువతలో చదువుపై ఆసక్తిని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ముఖ్యంగా "నేనొక నిత్య విద్యార్థిని" పుస్తకం జీవితాంతం నేర్చుకోవాలనే భావనను పెంపొందిస్తుందని, ప్రతి ఒక్కరూ చదవదగిన పుస్తకమని పేర్కొన్నారు. అలాగే "స్వగతాలకు స్వాగతాలు" పుస్తకం ఆత్మపరిశీలనకు దారి తీసే సాహిత్య కృతిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర అపారమని, ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కొనియాడారు. గురువును సన్మానించడం తనకు గర్వకారణమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మానుకొండ నాగేశ్వరరావు, ఎన్ సి హెచ్ చక్రవర్తి, ఎర్ర ప్రగడ రామకృష్ణ, శత్రువేదుల నాగేంద్ర, దహంగాం సాంబమూర్తి, సన్నిధానం నరసింహారావు శర్మ, అమ్మిన శ్రీనివాస రాజు, మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, సాహితీ ప్రియులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఏరియా ఉపరితల విభాగాలలో ట్రాన్స్ ఫర్ ప్రాతిపదిక టెక్నీషియన్స్ ఖాళీల భర్తీ కోసం యాజమాన్యం సర్క్యులర్ విడుదల..

- **హర్షం వ్యక్తం చేసిన ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి.**



**మణుగూరు.మే 10 (డి డి 9వార్త )**

భద్రాద్రి జిల్లా, మణుగూరు. ఏరియా లో ఉపరితల విభాగాల నందు ఏర్పడిన ఎలక్ట్రీషియన్ , ఫిట్టర్ ఖాళీలను ట్రాన్స ఫర్ ప్రాతిపదికన కొండాపురం అండర్ గ్రౌండ్ టెక్నీషియన్స్ తో భర్తీ చేసేందుకు శనివారం నాడు స్థానిక యాజమాన్యం సర్క్యులర్ విడుదల చేయడం పట్ల ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. ఉపరితల విభాగాలలో డిప్యూటేషన్ పేరిట కొండాపురం అండర్ గ్రౌండ్ టెక్నీషియన్స్ ఎక్కువ రోజులు విధులు నిర్వహించడం మూలంగా వారికి కలిగే నష్టాలు , ట్రాన్స ఫర్ ప్రాతిపదికతో ఖాళీల భర్తీ వల్ల టెక్నీషియన్స్ కు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ..

టి బి జి కె యస్ ఆధ్వర్యంలో ఏరియా సంబంధిత అధికారులకు వినతి పత్రం రూపంలో పొందుపరచి అందించడం జరిగిందని, దానితో పాటు ఇటీవల డైరెక్టర్ ఈ అండ్ యం మోకాళ్ళ తిరుమలరావు ను కార్పొరేట్ కార్యాలయంలో కలసి ఉపరితల టెక్నీషియన్స్ ఖాళీలు భర్తీ కోసం వినతి పత్రం అందించడం జరిగిందని ఆయన తెలిపారు. యువ టెక్నీషియన్స్ ఉజ్వల భవిష్యత్తు పై దృష్టి సారించిన స్థానిక యాజమాన్యం ట్రాన్స్ ఫర్ ప్రాతిపదికన ఉపరితల టెక్నీషియన్స్ ఖాళీలు కొండాపురం భూగర్భ గని కార్మికులతో భర్తీ చేయడం కోసం సర్క్యులర్ విడుదల చేయడం సంతోషకరమైన అంశం అని యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

యాజమాన్యం కల్పించిన ఈ అవకాశాన్ని ఆసక్తి ,అర్హత గల కొండాపురం భూగర్భ గని టెక్నీషియన్స్ సద్వినియోగం చేసుకోవాలని ఈ నెల 14 వ తేదీ లోపు కొండాపురం గని ఫిట్ ఆఫీస్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని ఆయన తెలిపారు. కొండాపురం భూగర్భ గని కి సరిపడా టెక్నీషియన్ లను కేటాయింపు చేసి అదనంగా ఉన్న టెక్నిషియన్స్ అందరికీ ఉపరితల విభాగంలో సీనియారిటీ ప్రామాణికంగా ట్రాన్స్ ఫర్ ప్రాతిపదికలో అవకాశం కల్పించాలని అందుకుగాను స్థానిక యాజమాన్యం తో పాటు కార్పొరేట్ యాజమాన్యం కూడా ప్రత్యేక చొరవ చూపాలని ఈ సందర్భంగా ఆయన తెలియచేశారు.




# పస్రా పోలీసు వారి విజ్ఞప్తి – నేటి నుంచి మండల స్థాయి వాలీబాల్ పోటీలు

**గోవిందరావుపేట, మే 10 (డిడి 9 వార్త)**

పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలో నేటి నుంచి మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించబడనున్నాయని పస్రా పోలీసులు తెలిపారు. గోవిందరావుపేట బాలికల ఉన్నత పాఠశాల వేదికగా జరగనున్న ఈ పోటీలలో మండల యువత అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పస్రా పోలీసు వారు కోరారు.

యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడంతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు సమయానికి హాజరై పోటీలను విజయవంతం చేయాలని పస్రా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

**బోనకల్,మే10,(డీడీ9 వార్త):**



బోనకల్ మండల కేంద్రంలో జరిగిన వివాహ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఆదివారం ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్‌రాజ్ పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.బోనకల్ గిరిజన కాలానికి చెందిన భూక్యా సైదా (గుర్జా) - వరలక్ష్మి కుమారుడు పవన్, వాణీ దంపతుల వివాహ వేడుకకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.అలాగే స్థానిక సాయిబాబా కళ్యాణ మండపంలో జరిగిన యార్లగడ్డ శ్రీను,నాగేంద్ర దంపతుల కుమారుడు గోపాల కృష్ణ - రేవతి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో బోనకల్ వైస్ ప్రెసిడెంట్ ,మాజీ జడ్పీటీసీ బానోతు కొండ, సర్పంచ్ బానోతు జ్యోతి,బోనకల్ సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, మాజీ ఎంపీపీ చిట్టిమోదు నాగేశ్వరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తూరు నాగేశ్వరరావు, తెల్లూరి రమేష్, మరిధు శేషు,గూగులోతు శ్రీను, జర్పుల లావణ్య, శివకృష్ణ,యోగి శ్రీనివాస్, శివకృష్ణ, యాలాద్రి, షేక్ బాజీ, నందమూరి సత్యనారాయన, టైగర్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు,కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పలు శుభకార్యాల్లో పాల్గొన్న రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**బోనకల్,మే10,(డీడీ9 వార్త):**

బోనకల్ మండల పరిధి లోని తూటికుంట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సాదినేని రాంబాబు కుమారుడు వివాహ వేడుకకు రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హాజరై నూతన వరుడును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమాల్లోజిల్లా నాయకులు కోట రాంబాబు,టెలికాం అడ్వైజ్ కమిటీ మెంబర్ ఉమ్మినేని కృష్ణ, గ్రామ సర్పంచ్ తుళ్లూరీ లక్ష్మినరసయ్య,కన్నేటి సురేష్,ఇతర ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ సభతో తెలంగాణలో బీజేపీకి నూతన ఊపు

- **రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం**
- **ధీమా వ్యక్తం చేసిన మేకల వనితా రెడ్డి**

**రాజేంద్రనగర్ మే 10 డిడి 9 వార్త**

సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభ చారిత్రాత్మకమని బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా దామోదర్ రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలంటూ హైదర్‌గూడ చౌరస్తాలో ప్రత్యేక ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్రజలను సభకు ఆహ్వానించారు.ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయకేతనం ఎగురవేసిందని,అదే ఉత్సాహంతో రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.ప్రధాని మోదీ సభ అనంతరం తెలంగాణ బీజేపీలో నూతన ఉత్తేజం నిండబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అవినీతి, బంధుప్రీతి లేని పాలన రావాలంటే ప్రజలు బీజేపీకి మద్దతివ్వాలని మేకల వనితా రెడ్డి కోరారు . తెలంగాణ పై బీజేపీ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించి ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రధాని మోదీ సభకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు తరలివెళ్లారు. బస్సులు, కార్లు,మోటార్‌సైకిళ్లపై పార్టీ శ్రేణులు సభకు చేరుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు.








# భద్రాచలంలో అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**భద్రాచలం, మే 10 (డిడి9 వార్త)**

భద్రాచలంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు కొరడా ఝుళిపించారు. ఆదివారం రాత్రి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను భద్రాచలం పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తుండగా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని గుర్తించి సీజ్ చేశారు.

సదరు ట్రాక్టర్ ప్రవీణ్ అనే వ్యక్తికి చెందినదిగా పోలీసులు నిర్ధారించారు. అనంతరం వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్సై శ్యాం కేసు నమోదు చేసి, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# ఈతకు వెళ్లి నీటిలో మునిగి ఇద్దరు మృతి

**కన్నాయిగూడెం మే10(డిడి 9 వార్త)**

కన్నాయిగూడెం మండలంలో గల లక్ష్మీపురం గ్రామ సమీపంలో గల గోదావరి నదిలో ఈతకు వెళ్లి ఇద్దరి మృత్యువాత పడిన సంఘటన కలకలం రేపుతుంది. వివరాల్లో వెళ్తే లక్ష్మీపురం గ్రామానికి చెందిన బొమ్మరాజు నరేష్ (30) ఆర్.ఎం.పి వైద్యుడు. జిట్ట విష్ణువర్ధన్(20) రోహిర్ గ్రామ వాసి. సంపత్ ముగ్గురు కలిసి గోదావరికి ఈతకు స్నానానికి వెళ్లగా ప్రమాదవశాత్తు నరేష్. విష్ణువర్ధన్ గల్లంతయ్యారు. సంపత్ చాకచక్యంగా ఒడ్డుకు చేరుకొని గ్రామంలోని వారికి. కుటుంబ సభ్యులకి స్థానిక ఎస్సైకి సమాచారం ఇవ్వగా ఎస్సై గజ ఈతగాళ్ల సహాయంతో వెతుకుగా మృత దేహాలు లభ్యమైనట్లు స్థానిక ఎస్సై వెంకటేష్ తెలిపారు. యువకుల మృతి తో గ్రామంలో విషాదఛాయలు అములుకున్నాయి



# ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోటి

**బోనకల్,మే10,(డీడీ9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లుని ఆదివారం ప్రజాభవన్ లో ఖమ్మం జిల్లా బోనకల్ మండలం నూతన కాంగ్రెస్ అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వర్ రావు ( కోటి) మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పార్టీ బలోపేతం కొరకు అనుసరించాల్సిన అంశాల గురించి డిప్యూటీ సీఎం కోటికి దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు పైడిపల్లి కిషోర్,మాజీ జెడ్పీటీసీ మోదుగు సుధీర్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు గాలి దుర్గారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మారుపల్లి ప్రేమ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జీ సుబ్బరావు పాల్గొన్నారు.

# గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు

- నేరాలు అదుపులో ఉంటాయని ఆశాభావం
- కరకగూడెం ఎస్సై పివి నాగేశ్వరరావు



**కరకగూడెం మే 11 డిడి 9 వార్త:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం ఆనంతారం గ్రామంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేసే దిశగా సీసీ కెమెరాలు ఏర్పాటు కార్యక్రమాన్ని కరకగూడెం ఎస్సై పివి నాగేశ్వరరావు చేపట్టారు. గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో, రహదారుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెరుగుతుందని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద ఘటనలు జరిగిన త్వరితగతిన గుర్తించే అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రామ ప్రజలు కూడా పోలీసులకు సహకరించి గ్రామ భద్రతకు తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజా ప్రతినిధులు యువకులు పాల్గొన్నారు





# రామయ్య చెంతకు అంజన్న మాలధారణ భక్తులు

- రేపు రామాలయంలో మాల విరమణకు దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- కొండగట్టు అంజన్నకు భద్రాద్రి రామయ్య పట్టు వస్త్రాలు అందజేసిన దేవస్థానం ఈవో

**భద్రాచలం, మే 10 , డిడి9 వార్త**

భద్రాచలంలో మంగళవారం జరిగే హనుమాన్ జయంతి వేడుకలకు శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం సిద్ధమవుతోంది. ఇప్పటికే రాష్ట్రంలోని కరీంనగర్, వరంగల్, నల్గొండ, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి అంజన్న దీక్షితులు భద్రాచలం చేరుకొని రామయ్య దర్శనం చేసుకుంటున్నారు. గత మూడు రోజులుగా హనుమాన్ భక్తుల రద్దీ పెరిగింది. అలాగే రామాలయంలో సైతం మంగళవారం జరిగే హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా దేవస్థానం తరపున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రామాలయ సమయాల్లో మార్పుతో పాటు అంజన్న ఆలయం వద్ద భక్తులకు త్వరితగతిన దర్శనం, మాల విరమణకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రముఖ అంజన్న క్షేత్రమైన కొండగట్టులో ఆదివారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం తరపున హనుమజ్జయంతి సందర్భంగా పట్టువస్త్రాలు దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు ఆధ్వర్యంలో బృందం సమర్పించారు. ఈ సందర్భంగా కొండగట్టు దేవస్థానం తరపున ఆలయ అధికారులు స్వాగతం పలుకగా ఒగ్గు డోలు నృత్యాలు, కోలాటాలతో కళాకారుల విన్యాసాలు చేస్తుండగా హనుమాన్ భక్తుల సమక్షంలో భద్రాద్రి రామయ్య కానుకగా పట్టువస్త్రాలను కొండగట్టు వైదిక బృందంకు అందజేశారు. ప్రతి ఏటా ఇదే విధంగా పెద్ద జయంతి ఉత్సవాల సమయంలో భద్రాద్రి దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తుంటారు.

**ఏటా అధిక సంఖ్యలో తరలివస్తున్న భక్తులు**

భద్రాచలంలో శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాలతో పాటు హనుమాన్ జయంతికే అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. రామయ్య స్వామికి హనుమాన్ వీర భక్తుడు కావడంతో ఇటీవల కాలంలో ఆంజనేయ మాలధారులు అధిక సంఖ్యలో భద్రగిరి వస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు భద్రాద్రి రామయ్య చెంతన ఇరుముడి విరమిస్తున్నారు. సుమారు వారం రోజులపాటు 50 వేల మందికి పైగానే స్వామి వారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో గత ఐదేళ్ల నుంచి హనుమాన్ జయంతి క్రమంగా ఉత్సవంగా మారు తోంది. మంగళవారం హనుమాన్ జయంతి నిరహించనుండటంతో భక్తులకు దేవస్థానంలోని ఆంజనేయస్వామి ఉపాలయంలో మాలవిరమణ చేస్తారు.

# నార్సింగిలో జోరుగా అక్రమ నిర్మాణాలు

- 250 నుంచి 300 గజాల్లో 'ఆకాశసౌధాలు
- చుట్టు కొలతల్లేవు - అంతస్తులకు హద్దుల్లేవు
- ప్లాన్లు గోరంత - అక్రమాలు కొండంత
- యంత్రాంగం నిద్రపోతోందా.? లేక మామూళ్ల మత్తులో జోగుతోందా?
- విజిలెన్స్ అధికారులు స్పందించేనా?

**రాజేంద్రనగర్,మే 10 డిడి 9 వార్త**

నార్సింగి మున్సిపాల్ సర్కిల్ పరిధిలో చట్టం చచ్చిందా.? నిబంధనలు తుంగలో తొక్కాల్సిందేనా.? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి.గాలిలో మేడల్లా లేస్తున్న అక్రమ కట్టడాలు చూస్తుంటే ,ఇక్కడ టౌన్ ప్లానింగ్ నిబంధనలు వర్తించవా అనే అనుమానం కలగక మానదు.అధికారుల అండదండలతో బిల్డర్లు రెచ్చిపోతుంటే,అడిగే నాథుడే కరువయ్యాడని మున్సిపల్ ప్రజలు కోడై కూస్తున్నారు.



**చుట్టు కొలతల్లేవు - అంతస్తులకు హద్దుల్లేవు**

250 నుండి 300 గజాల చిన్న స్థలాల్లో సైతం సెట్ బ్యాక్‌లు వదలకుండా ఐదు, ఆరు అంతస్తులను లేపుతున్నారు.ఇది భవిష్యత్తులో అగ్నిప్రమాదాలు జరిగితే మృత్యు కూపాలుగా మారే ప్రమాదం ఉంది. పేపర్ మీద రెండు అంతస్తుల ప్లాన్ చూపించి,గ్రౌండ్ మీద భారీ కట్టడాలను నిర్మిస్తూ ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్నారు. అధికారుల మౌనం వెనుక భారీ స్థాయిలో 'వసూళ్ల' పర్వం సాగుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రశ్నిస్తే ఏసీపి ఎందుకు పలకడం లేదు?**

నార్సింగిలో జరుగుతున్న ఈ అక్రమ తతంగంపై వివరణ కోరడానికి ఏసీపి మనోహర్ ని సంప్రదించగా,ఆయన 'సేమిరా'అనడం విశేషం. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి అక్రమాలను అరికట్టాల్సింది పోయి,నోరు మెదపకపోవడం వెనుక మర్మమేమిటి.? అక్రమార్కులకు ఆయన రక్షణ కవచంలా మారుతున్నారా.? అని స్థానికులు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

**ఉన్నతాధికారులు మేల్కొనేది ఎప్పుడు?**

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి,నార్సింగిలో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలి. కఠిన చర్యలు తీసుకోవాలి: నిబంధనలు ఉల్లంఘించిన భవనాలను వెంటనే కూల్చివేసి,బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.సామాన్యుడికి ఒక రూలు,బడా బిల్డర్లకు మరో రూలా.?అంటూ జనం ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా యంత్రాంగం కదిలి అక్రమ నిర్మాణాలకు చెక్ పెడుతుందో లేదో చూడాలి.

# 41 సార్లు రక్తదానం చేసిన దాతకు సన్మానం

- తలసేమియా పిల్లలకు మద్దతుగా సేవలు
- టి.ఎస్.సి.ఎస్ గుర్తింపు

**రాజేంద్రనగర్ మే 10 డిడి 9 వార్త**

తలసేమియా,సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు మద్దతుగా నిరంతర రక్తదానం చేస్తూ సేవలందిస్తున్న నరేందర్ బాబును తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ ప్రత్యేకంగా సత్కరించింది. ఇప్పటివరకు 41 సార్లు రక్తదానం చేసిన నరేందర్ బాబును టీ.ఎస్.సి.ఎస్,యాజమాన్యం అభినందిస్తూ ఆయన సేవలను ప్రశంసించింది. ప్రాణాలను కాపాడే ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం తనకు గౌరవంగా ఉందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా తోటి రక్తదాతలు చందు, అశోక్‌లతో కలిసి ఈ గుర్తింపు కార్యక్రమంలో పాల్గొని ఆనందాన్ని పంచుకున్నట్లు తెలిపారు.ప్రతి రక్తదానం ఒక ప్రాణాన్ని నిలబెడుతుందన్న సందేశంతో టీ.ఎస్.సి.ఎస్. చేస్తున్న నిరంతర కృషికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# శంషాబాద్‌లో విషాదం

- మిస్సింగ్‌గా నమోదైన బాలుడు వాగులో మృతదేహంగా లభ్యం

**రాజేంద్రనగర్ మే 10 డిడి 9 వార్త**

శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మిస్సింగ్‌గా నమోదైన 17 ఏళ్ల బాలుడు వాగులో మృతదేహంగా లభ్యమైన ఘటన విషాదాన్ని నింపింది.మృతుడు సంగారెడ్డి జిల్లా ఆర్‌సీ పురం మండలం ఎదులనాగులపల్లి గ్రామానికి చెందిన బైగారి శ్రీచరణ్‌గా పోలీసులు గుర్తించారు.

పోలీసుల వివరాల ప్రకారం.. బైగారి హన్మంతు కుటుంబ సభ్యులతో కలిసి నానాజిపూర్ గ్రామంలో బంధువుల గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ క్రమంలో శనివారం ఉదయం పూజ కార్యక్రమం జరుగుతుండగా శ్రీచరణ్‌ను కొబ్బరికాయలు తీసుకురావాలని పంపించారు.అనంతరం మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్తున్నానని చెప్పి TS07GE1045 నంబర్ గల బైక్ తీసుకుని వెళ్లిపోయాడు.

చాలాసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని ఫోన్‌కు పలుమార్లు కాల్ చేసినా స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళన చెందారు.వెతుకులాటలో భాగంగా నానాజిపూర్ వాగు సమీపంలోని హనుమాన్ ఆలయం వద్ద అతని బైక్ కనిపించింది.దీంతో కుటుంబ సభ్యులు శంషాబాద్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు,ఇదే సమయంలో డయల్




100కు వచ్చిన సమాచారం మేరకు నానాజిపూర్ వాగులో ఓ యువకుడు మృతదేహంగా తేలియాడుతున్నట్లు గుర్తించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా, అది మిస్సింగ్ అయిన శ్రీచరణ్‌దేనని నిర్ధారించారు. బహిర్భూమికి వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందినట్లు ప్రాథమికంగా భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై శంషాబాద్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




# ప్రజా సమస్యలపై నిరంతర పోరాటమే సిపిఐ లక్ష్యం

- పుస్తకాల నర్సింగరావు
- 18 శాఖల సమన్వయంతో ఉద్యమాలను బలోపేతం చేయాలని సూచన
- ప్రతి మూడు నెలలకు శాఖ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం
- అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్

**రాజేంద్రనగర్ మే 10 డిడి 9 వార్త**

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాల నర్సింగరావు పిలుపునిచ్చారు.

రాజేంద్రనగర్ మండల సిపిఐ సమితి ఆధ్వర్యంలో మండల కార్యాలయం ఏఆర్ దేవరాజ్ భవన్‌లో మండలంలోని 18 శాఖల కార్యదర్శులు,ప్రజా సంఘాల అధ్యక్షులు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన పుస్తకాల నర్సింగరావు మాట్లాడుతూ.. రాష్ట్ర,జిల్లా పార్టీలు ఇచ్చే కార్యక్రమాలతో పాటు స్థానిక సమస్యలపై కూడా నిరంతరం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రతి శాఖ సమావేశం మూడు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. మండలంలో అన్ని ప్రజా సంఘాల నిర్మాణాన్ని బలోపేతం చేయాలని ,త్వరలో అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్),అఖిల భారత విద్యార్థి సమైక్య(ఏఐఎస్ఎఫ్) మండల మహాసభలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.అలాగే అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని సమావేశం తరపున డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శులు ,ప్రజా సంఘాల నాయకులు జి. సత్యం,జే.సదానంద గౌడ్, సయ్యద్ కాజా,పాండు, సాబేరు,హుస్సేన్ భాయ్, పుష్ప,శాంతమ్మ,సరూప, వాణి,కృష్ణ,కాజా,ప్రతాప్ రెడ్డి, నవీన్ కుమార్,చారి పాల్గొన్నారు.




# జనగామలో విషాదం – ఆటో యూనియన్ నేత మచ్చ శ్రీనివాస్ మృతి

**జనగామ మే 10(డిడి 9 వార్త ) బ్యూరో**

జనగామ జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ ఆటో యూనియన్ నాయకుడు, జిల్లా డివిజన్ ఉపాధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్ ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారంలో ఆయన కీలక పాత్ర పోషించారని యూనియన్ నాయకులు తెలిపారు. ఆయన అకాల మరణంపై జిల్లా వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.





# శంషాబాద్‌లో దారి దోపిడీ ముఠా అరెస్ట్

- నలుగురు నిందితులు అరెస్ట్
- సీసీటీవీ ఆధారాలతో కేసు ఛేదించిన శంషాబాద్ పోలీసులు
- దోచుకున్న సొత్తుతో పాటు ఆటో స్వాధీనం

**రాజేంద్రనగర్ మే 10 డిడి 9 వార్త**

శంషాబాద్ పరిధిలో ఆటోలో ప్రయాణిస్తున్న యువకులను టార్గెట్ చేసి దోపిడీకి పాల్పడిన నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు.బాధితులను బెదిరించి నగదు,వెండి ఆభరణాలు,మొబైల్ ఫోన్లు దోచుకోవడంతో పాటు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసుల కథనం ప్రకారం..కొత్తూర్‌కు చెందిన ముగ్గురు యువకులు చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. శంషాబాద్ దాటి ఘాన్సీ మియాగూడ సమీపంలోని జాతీయ రహదారిపైకి చేరుకున్న తర్వాత ఆటో డ్రైవర్ తన సహచరులతో కలిసి బాధితులను బెదిరించి దాడికి దిగి,బాధితుల వద్ద ఉన్న రూ.1,800 నగదు,రెండు వెండి చైన్లు,ఒక వెండి ఉంగరం,రెండు మొబైల్ ఫోన్లు లాక్కొన్నారు.అదేవిధంగా గూగుల్ పే ద్వారా మరో రూ.5,000 బలవంతంగా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం “ఎవరికి చెప్పినా చంపేస్తాం”అంటూ బెదిరించి బాధితులను హైవేపై దింపేసి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన శంషాబాద్ పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.అరెస్టైన వారిలో ఆటో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు యువకులు ఉన్నట్లు వెల్లడించారు.

నిందితుల వద్ద నుంచి దోచుకున్న నగదు,వెండి చైన్లు,వెండి ఉంగరం,మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు ఘటనలో ఉపయోగించిన ఆటోను సీజ్ చేశారు.అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరచగా ,రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కేసును వేగంగా ఛేదించిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

